## వాసర్‌లో విఠలేశ్వరుడికి పల్లకీసేవ



వాసర్‌లో భజనలుచేస్తూ శోభాయాత్ర చేస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని వాసర్‌గ్రామంలో అఖండహరినామ సప్తాహ ఉత్సవాలు అంబరాన్నంటాయి. శుక్రవారం గ్రామంలోని ఆంజనేయస్వామి, రుక్మిణీ మాత సమేత పాండురంగస్వామి మందిరంలో గతవారంరోజులుగా సప్తాహ కార్యక్రమాలు కొనసాగుతున్న విషయం పాఠకులకు విదితమే. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని గ్రామస్థులు నిండు కలశాలతో గ్రామంలోని పురవీధుల గుండా భజనలుచేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. గ్రామస్థులు ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**-కాట్రియాల సర్పంచి కొత్త స్రవంతిరాజేందర్**



పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచి స్రవంతిరాజేందర్

**రామాయంపేట, మార్చి 6, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గ్రామ సర్పంచి కొత్త స్రవంతి తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లుపొదలను శుభ్రంచేశారు. అనంతరం గ్రామస్థులకు పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి బాబునాయక్‌తోపాటు, వార్డుసభ్యులు, గ్రామప్రజలు, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో పారిశుధ్య పనులు

**-సోషల్ మీడియాలో వీడియోలు, ఫోటోలు వైరల్**

**-కేంద్ర బృందం పర్యటన దృష్ట్యా పరిశుభ్రత పనులంటున్న హెచ్‌ఎం**

**చౌటకూరు, మార్చి 6, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని శివంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పారిశుధ్య పనులు చేయించడం వివాదాస్పదంగా మారింది. పలకా బలపం పట్టాల్సిన విద్యార్థులు చీపుర్లు పట్టి పాఠశాల తరగతి గదులను, పరిసరాలను శుభ్రంచేయడం, మెట్లకు రంగులు వేయడం, చెట్లకు సున్నం వేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారాయి.



విద్యార్థులతో పారిశుధ్య పనులు చేయిస్తున్న దృశ్యం

శనివారం పిఎంశ్రీ సెంట్రల్ టీం పాఠశాలను సందర్శించనున్న దృష్ట్యా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేదశ్రీ విద్యార్థులతో పాఠశాలలో పారిశుధ్య పనులుచేయిస్తున్న దృశ్యాలను వీడియోలు, ఫోటోలు తీసి శుక్రవారం వివిధ వాట్సప్ గ్రూప్‌లలో పోస్టు చేయడంతో, ఆ వీడియోలు, ఫోటోలు వైరల్ అయ్యాయి. పాఠశాలలో విద్యార్థులతో పారిశుధ్య పనులు చేయించడంతో, పారిశుధ్య సిబ్బంది ఉండగా విద్యార్థులతో పనులెందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈవిషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేదశ్రీని ప్రభాతవార్త వివరణ కోరగా విద్యార్థులతోపాటు తాము సైతం పాఠశాలలో పారిశుధ్య పనులు చేపట్టామని సమాధానం ఇచ్చారు. ఉద్దేశపూర్వకంగా తాను పిల్లలతో పనులు చేయించలేదన్నారు. విద్యార్థులతో పాఠశాలలో పారిశుధ్య పనులు చేయించినట్లు తెలుసుకున్న మండల విద్యాధికారి అనురాధ, పిఆర్‌టియు మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డిలు పాఠశాలకు చేరుకుని విచారణ జరిపారు. విద్యార్థులతో వేరువేరుగా మాట్లాడి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మహిళా అంతర్జాతీయ దినోత్సవం జరుపుకుంటున్న మహిళలు

**రామచంద్రాపురం, మార్చి 6, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజి కాలనీలో బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలు అంతర్జాతీయ మహిళలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి హాజరై మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు రాణియాదవ్, విజయ, స్వర్ణజ్యోతి, లత, విజయలక్ష్మి, అరుణజ్యోతి, సునీత, రాధ, గాయత్రి, తార, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యం

**-మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ మరాజుయాదవ్**

**నర్సాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:**
తెలంగాణ అభివృద్ధికోసం ప్రజాపాలన ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 99రోజుల ప్రగతిప్రణాళికలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మాచునూరి లక్ష్మీరాజుయాదవ్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు శుక్రవారం పురపాలక ఆవరణలో, ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి, వినిపించి, 99రోజుల ప్రగతిప్రణాళికలో రోజువారి కార్యక్రమాలను తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మినీకే నరసమ్మ, అంతారం సుధీర్‌గౌడ్, అఫ్రీన్, దుర్గప్పగారి సరళ, తహసీల్దార్ శ్రీనివాస్, సిఐ జాన్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో నియోజకవర్గ ఇంచార్జి, మున్సిపల్ చైర్మన్

**నర్సాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం నిరుపేదల సొంతింటికల సాకారం చేయడానికి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటికల నెరవేరిందని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్‌లు అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 7వవార్డులో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, మున్సిపల్‌చైర్మన్ మాచునూరి లక్ష్మీరాజుయాదవ్‌ల చేతులమీదుగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, కౌన్సిలర్ ఎలియాస్ ఖాన్, సుధీర్‌కుమార్ గౌడ్, దావూద్ ఆంజనేయులుగౌడ్, రవి, నాయకులు అన్వర్‌ఖాన్ మహమ్మద్ అక్బర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళికపై విస్తృత సమావేశం

**-అధికారులకు దిశానిర్దేశం చేసిన మున్సిపల్ చైర్మన్ నాగేష్‌శెట్కార్**



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

**నారాయణఖేడ్, మార్చి 6, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డ్‌లో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నాగేష్‌శెట్కార్ పాల్గొని కార్యక్రమ లక్ష్యాలు, అమలు విధానంపై చర్చించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం 99 రోజులు - 10 సూత్రాలు - సమగ్ర అభివృద్ధి అనే లక్ష్యంతో జూన్ 6 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న కార్యాచరణపై సమగ్రంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ, మున్సిపల్ కౌన్సిలర్లు సురేఖ (2వ వార్డ్), మహేష్ (5వ వార్డ్), లక్ష్మణ్ (6వ వార్డ్), బాణపురం రాజు (9వ వార్డ్), షారుఖ్ (12వ వార్డ్), వివేకానంద మహేందర్ (13వ వార్డ్) లతోపాటు అభిషేక్‌శెట్కార్, మైతబ్, సుబర్, రామకృష్ణ, గౌస్ చిష్తీ, కొండల్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, మొయినొద్దీన్ కురేషి తదితరులు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల అమలే ధ్యేయం

**-ప్రజాపాలన ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్యానాగరాజు**



ప్రజాపాలన ర్యాలీ ప్రారంభిస్తున్న గజవాడ లావణ్యానాగరాజు

**రామాయంపేట, మార్చి 6, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలే ధ్యేయంగా పనిచేస్తామని, మున్సిపల్ ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్యానాగరాజు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమాన్ని శుక్రవారం రామాయంపేటలో ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడి ఇంటి గడప దాకా చేరేలా కృషిచేయడం ఈకార్యక్రమం ప్రధానలక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది, పాలకవర్గ సభ్యులతో కలిసి పట్టణంలో అవగాహనర్యాలీ నిర్వహించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో రామాయంపేటను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పోచమ్మల నవనీత, మున్సిపల్ మేనేజర్ రఘువరణ్, ఆర్ఐ బాలక్రిష్ణ, కౌన్సిలర్లు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాకమిషన్ నివేదికను రద్దు చేయాలి

**-బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు**

**రామాయంపేట, మార్చి 6, ప్రభాతవార్త:**
తెలంగాణ విద్యాకమిషన్ సమర్పించిన నివేదికను పూర్తిగా రద్దు చేయాలని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు డిమాండ్‌చేశారు. ఉపాధ్యాయ వృత్తిని వేతనంతో పోల్చడం అవమానకరమని, ఉపాధ్యాయుల జీతాలను తగ్గించాలని సూచించడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఈ నివేదిక పేద, అణగారిన వర్గాల విద్యార్థులకు నష్టంకలిగించేలా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల ద్వారానే గ్రామీణ పేదపిల్లలకు విద్య అందుతుందని, అలాంటిసమయంలో విద్యారంగాన్ని బలహీనపరిచే సూచనలు చేయడం సరైందికాదని విమర్శించారు. అలాగే ప్రాథమికవిద్య మాతృభాషలోనే ఉండాలని, పదోతరగతి బోర్డు పరీక్షలను కొనసాగించాలని, ఉపాధ్యాయ నియామకాలు, అర్హతల విషయంలో ప్రతిపాదనలు పునఃపరిశీలించాలని ఆయన కోరారు. విద్యారంగంలో అనుభవం ఉన్న నిపుణులతో కొత్తకమిటీ ఏర్పాటుచేసి సమగ్రంగా అభిప్రాయాలు సేకరించాలని సూచించారు. లేదంటే ఈ విద్యాకమిషన్‌ను వెంటనే రద్దుచేసి కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం (ఎన్‌ఈ పి2020)ను రాష్ట్రంలో అమలు చేయాలని రాగి రాములు కోరారు.

## అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం



సర్పంచులను సన్మానించిన ఎంపిడివో దామోదర్

**చిన్నశంకరంపేట, మార్చి 6, ప్రభాతవార్త:**
గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం అని ఎంపిడివో దామోదర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిన్నశంకరంపేటలోని ఐకెపి కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు, మండల అధికారులకు సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎంపిడిఓ దామోదర్ మాట్లాడుతూ సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో పకడ్బందీగా చేపట్టాలన్నారు. అనంతరం నూతన సర్పంచులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి, పశువైద్యాధికారి గీతామాలిక, వివిధశాఖల మండల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## మహాధర్నాకు తపస్ సంపూర్ణ మద్దతు

**-తపస్ నాయకులు మంగ నర్సింలు**



మాట్లాడుతున్న నర్సింలు

**పాపన్నపేట, మార్చి 6, ప్రభాతవార్త:**
డిఎస్సీ-2003లో నియమితులైన ఉపాధ్యాయులకు పాతపెన్షన్ పునరుద్ధరణ కోసం మార్చి 7న తలపెట్టిన ధర్నాకు తపస్ సంపూర్ణమద్దతు ప్రకటించింది. ఈ మేరకు తపస్ నాయకులు మంగ నర్సింలు, మండల అధ్యక్షులు దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తులసిరాం, సీనియర్ నాయకులు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, డిఎస్సీ-2003 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు ప్రభుత్వ విధానాల కారణంగా దీర్ఘకాలం పాటు నియామకాలకు దూరమై అనంతరం విధుల్లో చేరినప్పటికీ, వారికి పాతపెన్షన్ విధానం వర్తించకుండాచేయడం అన్యాయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో నెం.57 ప్రకారం ఈ అంశంపై గౌరవ హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. న్యాయమైన హక్కు సాధన కోసం ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నాలో ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు

**జహీరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:**
ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక ర్యాలీని శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, కమిషనర్ జైత్రం, మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది, మెప్మా ఆధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రబీ పంటల సస్యరక్షణపై రైతులకు అవగాహన



రబీ పంటల సస్యరక్షణపై అవగాహన పొందుతున్న రైతులు

**సిర్గాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని రైతు వేదికలో పోస్ట్ బడ్జెట్ వెబినార్‌పై లైవ్ టెలికాస్ట్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు కొత్త విషయాలను వివరించారు. రబీ పంటల సస్యరక్షణపై సూచనలు చేశారు. జొన్న పంటను పండిస్తున్న రైతులు ఆన్‌లైన్‌లో పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, ఏఈఓ భాస్కర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



రామాయంపేటలో డంప్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ శ్రావణ్

**రామాయంపేట, మార్చి 6, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించేందుకు మున్సిపల్ కమిషనర్ బి.శ్రావణ్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈసందర్భంగా పట్టణంలోని డంప్ యార్డ్, మల్లె చెరువు వద్ద ఉన్న వాటర్ బాడీలు, అలాగే సిద్దిపేట రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం పరిసర ప్రాంతాలను ఆయన సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.

కొన్ని ప్రాంతాల్లో చెత్త కుప్పలు పెద్దఎత్తున పేరుకుపోయినట్లు గమనించిన కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మల్లె చెరువు పరిసర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కలగవచ్చని పేర్కొన్నారు. అందువల్ల అక్కడ ఉన్న చెత్తను తక్షణమే తొలగించి పరిసరాలను పూర్తిగా శుభ్రం చేయాలని సంబంధిత సానిటరీ ఇన్స్పెక్టర్, సిబ్బందికి సూచించారు. అదేవిధంగా సిద్దిపేట రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం ముందు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, ఆ ప్రాంతంలో కూడా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. పట్టణంలో ఎక్కడా చెత్త కుప్పలు పేరుకుపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎ. రఘువరణ్, ఆర్ఐ బాలకృష్ణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ పోచమ్మల శంకర్, సానిటరీ జవాన్ ప్రవీణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో ప్రత్యేక వైద్యశిబిరానికి స్పందన



ప్రత్యేక ఆరోగ్యశిబిరం నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

**అల్లాదుర్గం, మార్చి 6, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన అల్లాదుర్గంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ప్రత్యేక ఆరోగ్య నిపుణులతో నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. శిబిరానికి చేరుకున్న 153మందిని వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి 22మందిని చికిత్సల నిమిత్తం రెఫర్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ అనిల్, వేద ప్రకాష్‌రెడ్డి, మద్దూరి సౌమ్య, కార్యదర్శి ప్రభాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నవ్య, డాక్టర్ అశ్విని, డాక్టర షారఫొద్దీన్, డాక్టర్ షిప్ర, స్వర్ణలత, అనుష్, రాఘవేంద్రరెడ్డి, వసుధ, భరద్వాజ్, తిరుమలేష్, మధు, షేక్ హసీనా తదితరులు పాల్గొన్నారు.

## వడ్డిలో పశువైద్య శిబిరం సక్సెస్



పశువైద్య శిబిరంలో పశువులకు చికిత్సలు చేస్తున్న డాక్టర్లు

**న్యాల్‌కల్, మార్చి 6, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని వడ్డిగ్రామంలో శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశువులకు గర్భస్థ పరీక్షలు, సాధారణచికిత్సలు చేసి కావాల్సిన మందులను రైతులకు అందచేశారు. 13 పశువులకు గర్భస్థ పరీక్షలు, 8 పశువులకు సాధారణ చికిత్సలు, 2 పశువులకు గర్భధారణ టీకాలు, 32 దూడలకు నట్టలనివారణ మందులను వేసినట్లు డాక్టర్ గణేష్ వివరించారు. రైతులు పశువైద్యశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి భోజుగొండ సరస్వతి, గోపాలమిత్ర సూపర్‌వైజర్ తుక్కారెడ్డి, గోపాలమిత్రలు ఎ.జనార్ధన్‌రెడ్డి, బి.నాగప్ప, హుస్సేని, గ్రామ పాడిరైతులు పాల్గొన్నారు.

## మద్యం తాగినవారిని పరిశీలించిన ఎస్ఐ



మద్యం తాగినవారిని పరిశీలిస్తున్న ఎస్ఐ శంకర్

**అల్లాదుర్గం, మార్చి 6, ప్రభాతవార్త:**
మద్యం తాగి వాహనాలు నడపరాదని, దీనివల్ల అనేక అనర్థాలు జరిగే అవకాశం ఉందని అల్లాదుర్గం ఎస్ఐ శంకర్ తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా 161 జాతీయ రహదారిపై నెంబర్‌ప్లేట్లులేని 8వాహనాలను సీజ్‌చేసి జరిమాన విధించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా తాగి వాహనాలు నడిపినవారికి డ్రంక్ అండ్ డ్రైవ్ చానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలని, తాగి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చందాపూర్ పాఠశాలలో స్వయంపాలన



చందాపూర్‌లో స్వయం పాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**చిన్నశంకరంపేట, మార్చి 6, ప్రభాతవార్త:**
మండల పరిధి చందాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. జిల్లా విద్యాధికారిగా మౌనిక, ప్రధానోపాధ్యాయులుగా శివతేజ, ఉపాధ్యాయులుగా శివకుమార్, శ్రీధర్, ఐశ్విక, కిట్టు, ప్రణీత్ కుమార్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తోటవ్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ముస్లింల ఆదరాభిమానాలు మరవలేనివి

**-ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి**



షాదీఖానాలో ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:**
నర్సాపూర్ నియోజకవర్గంలోని ముస్లింలు తనపై చూపుతున్న ఆదరాభిమానాలు మరవలేనివని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని షాదీఖానాలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీతారెడ్డి ముస్లింలను ఉద్దేశించి మాట్లాడారు. రంజాన్ పండగను ప్రతి ఒక్కరు సోదరభావంతో జరుపుకోవాలని ఆమె సూచించారు. తను ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ముస్లింలు తనపై అభిమానంతో అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నహీముద్దీన్, నాయకులు సత్యంగౌడ్, షేక్ హుస్సేన్, తదితర ముస్లింలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడివో రమేష్, తహసీల్దార్ లక్ష్మారెడ్డి

## 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'పై సమావేశం

**హుస్నాబాద్ రూరల్, మార్చి 6, ప్రభాతవార్త :** 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఎంపిడివో రమేష్, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, శుక్రవారం మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమం మార్చి 6 నుంచి ప్రారంభమై జూన్ 12 వరకు కొనసాగనుంది. 99 రోజుల కార్యక్రమాన్ని ఐదుస్థాయిల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమాలు అమలుచేయనున్నారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 10 ముఖ్య టీమ్స్‌ను నిర్ణయించారు. పరిసరాల పరిశుభ్రత, పెండింగ్ సమస్యలపై, ఆరోగ్యం, సురక్షిత ప్రయాణం, సంక్షేమం, పిల్లల భద్రత, రక్షణతోపాటు డ్రగ్స్ నివారణ, వంటి అంశాలపై ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయా అంశాల అమలు విధానాలు, బాధ్యతలు, సమన్వయం తదితర విషయాలపై అధికారులు సమగ్రంగా చర్చించి తదుపరి కార్యాచరణపై సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఎంఈఓ మణిల, ఎంపీఓ మోహన్, ఏపీఎం తిరుపతి, సీడీపీఓ జయప్రద, హాస్టల్ వార్డెన్లు మల్లేషం, వెంకటయ్య, రాజేశ్వరి, ప్రభాకర్, ప్రతిమ, రవిచంద్ర, భవాని, డాక్టర్ మున్నాతో పాటు మండల శాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన న్యాయమూర్తి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



హాజరు పట్టికను పరిశీలిస్తున్న న్యాయమూర్తి సంతోష్‌కుమార్

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదారాబాద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ కె.సాయి రమాదేవి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాళ్లకుంట కాలనీలోగల ప్రాథమికోన్నత పాఠశాలను ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎఫ్ఎసి కార్యదర్శి సంతోష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా లీగల్ అవగాహన ప్రోగ్రాం నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి సంతోష్‌కుమార్ స్కూల్ తరగతి గదులను, పరిసరాలను పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నాణ్యత, వంట గది పరిసరాలను నిల్వ చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. పిల్లలకు కల్పిస్తున్న వసతులపై న్యాయమూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎంపిడివో



ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపిడివో తదితరులు

**తొగుట, మార్చి 6,ప్రభాతవార్త :** ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరైన లబ్దిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎంపిడివో నాగేశ్వరరావు సూచించారు. తొగుటలో శుక్రవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఇందిరమ్మ కమిటీ సభ్యులు మేకల రామస్వామి, కార్యదర్శి సతీష్, హౌసింగ్ ఎఈ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

**రాష్ట్ర సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్**



పిహెచ్‌సికి వచ్చిన రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రనాయక్

**చిన్నకోడూరు, మార్చి 6, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలు అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని ప్రజా ఆరోగ్య,కుటుంబ సంక్షేమ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. చిన్నకోడూరులోని పిహెచ్‌సిని సందర్శించి ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికను ప్రారంభించి మాట్లాడారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99రోజులు నిర్వహిస్తుందన్నారు. గ్రామస్థాయిలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చేపట్టాలని ఆదేశించారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు అన్ని పాఠశాలల్లో పిల్లలకు ప్రత్యేక నిపుణులతో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ వినోద్ బాబ్జి,డిప్యూటి డిఎంహెచ్ఓలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహేందర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిర్మల డాక్టర్ దీప్తి, డాక్టర్ మీనా, పిహెచ్‌సి డాక్టర్ ఐశ్వర్య, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## వార్డు సభ్యులకు శిక్షణ

**బెజ్జంకి, మార్చి 6, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటివిడతలో భాగంగా 12 గ్రామాల వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ పంచాయతీ బాధ్యతలు, విధులపై అధికారులు అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అధికారులు తెలిపారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సభ్యులు

# పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మికొమురయ్య**



మాట్లాడుతున్న దండి లక్ష్మికొమురయ్య

**హుస్నాబాద్ రూరల్, మార్చి 6, ప్రభాతవార్త**

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన..ప్రగతి ప్రణాళిక'లో భాగంగా హుస్నాబాద్‌లో శుక్రవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ తాటి మల్లికార్జున్ ఆధ్వర్యంలో మల్లెచెట్టు చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, మున్సిపల్ కార్మికులు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతోపాటు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పద్మ రవీందర్, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష, బూరుగు లతకిష్టస్వామి, కొండ రజిత, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, భూక్యాసంపత్, కాశబోయిన సరిత, గడిపే సతీష్‌కుమార్, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేణి రమేష్, బొల్లి శ్రీనివాస్, ఆకుల రజితవెంకన్న, వైద్యం కిరణ్‌ప్రసాద్, గాదెపాక రవీందర్, వాల సుప్రజనవీన్‌రావు, బత్తుల స్వరూప, గోపగోని శోభన్‌బాబు పాల్గొన్నారు.

**ఒకటవ వార్డులో...**

హుస్నాబాద్ మున్సిపాలిటీలో చేపట్టిన 99 రోజుల పట్టణప్రగతిలో భాగంగా 1వ వార్డు నేతాజీ నగర్‌లో కౌన్సిలర్ చెన్నబోయిన అనూషవిద్యాసాగర్ శుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, మహిళ కాంగ్రెస్ నాయకులు బోనగిరి రజిత, దుబాసి రజిత, బోనగిరి లావణ్య, నల్ల లావణ్య, స్వయం సహాయక సంఘాల మహిళలు(ఎస్‌హెచ్‌జి మహిళలు), వార్డ్ అధికారి, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రతాప్‌రెడ్డి

## అంబేద్కర్ గద్దెను కూల్చడం అమానుషం

**-బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**వర్గల్, మార్చి 6 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం నాచారం గ్రామంలో గ్రామస్తులు అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు గద్దెను నిర్మిస్తే అధికారులు అర్ధ రాత్రి కూల్చివేయడం అమానుషమని బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. అధికారులు కూల్చిన స్థలంలోనే అంబేద్కర్ గద్దెను పునర్నిర్మించిన గ్రామస్తులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ నాచారంలో అంబేద్కర్ గద్దె నిర్మాణాన్ని కూల్చివేయడం అంబేద్కర్‌ను అగౌరవపరిచినట్లే అన్నారు. గ్రామస్తులపై పెట్టిన కేసును వాపస్ తీసుకోవాలని అధికారులను కోరడం జరిగిందన్నారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అన్ని పార్టీలు మద్దతు తెలపాలని అన్నారు.

## ముగిసిన రెండు రోజుల జాతీయ సదస్సు

**సంగారెడ్డి, మార్చి 6 ప్రభాతవార్త :** తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో కంప్యూటర్ సైన్స్, జీవశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ద ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ సైన్స్ ఇంటెగ్రేటింగ్ కాంపిటేషనల్ ఇంటెలిజెన్స్ అండ్ బయోలాజికల్ రీసెర్చ్ అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసిందని ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. తారా కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సులో దేశ, రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు నుండి వచ్చిన అధ్యాపకులు, పరిశోధకులు పై అంశంపై తమ పరిశోధనా పత్రాలను జాతీయ సమర్పించడం జరిగిందని, త్వరలో ఈ పరిశోధనాపత్రాలకు సంబంధించి ఐఎస్బిఎన్ నంబర్‌తో ప్రత్యేక మ్యాగజిన్‌ను విడుదల చేస్తామని తెలిపారు. సదస్సులో ప్రొఫెసర్ బాల భాస్కర్, ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్ ఉపన్యాసాలు, కాంపిటేషనల్ బయాలజీ ఎడిటింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్ బయో రీమెడిటేషన్ వంటి అంశాలపై ప్రత్యేక చర్చలను నిర్వహించడం జరిగిందని ప్రధానంగా జీవశాస్త్ర పరిశోధనలో కాంపిటేషన్లు పద్ధతుల ప్రాముఖ్యతను జీవశాస్త్రంపై వాటి ప్రభావాలను తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కన్వీనర్ డాక్టర్ నాగప్రసాద్, కో కన్వీనర్ డాక్టర్ వై. రమేష్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ మిథున్‌కుమార్‌రాథోడ్, కళాశాల అధ్యాపక బృందము, ఎమ్మెస్సీ జువాలజీ మరియు కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని విద్యార్థులు, ఎన్సిసి క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు

**సంగారెడ్డి, మార్చి 6 ప్రభాతవార్త :** సంగారెడ్డిలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేటికాలంలో చాలాచోట్ల అగ్ని ప్రమాదాలు జరుగుతుండడం గమనిస్తున్నాం, గ్యాస్ సిలిండర్ విషయంలో, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి సంగారెడ్డిలోని అగ్నిమాపక శాఖ అధికారి భిక్షపతి తగిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలిపారు. చక్కని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శ్రీ నాగిరెడ్డి, యాదగిరి, యాదయ్య, రవి, రత్నం, ఇక్బాల్, శ్రీకాంత్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌పై రైతులకు అవగాహన

జగదేవ్‌పూర్, మార్చి 6 (ప్రభాతవార్త): ఇటీవల కేంద్ర ప్రభుత్వం రైతులకు కేటాయించిన బడ్జెట్‌కు సంబంధించి విషయాలను రైతులకు తెలియజేసేందుకు శుక్రవారం రైతువేదికలో పోస్ట్ బడ్జెట్ వెబినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వసంతరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి సంబంధించిన పథకాలు, రైతులకు అందుబాటులోఉన్న సబ్సిడీలు, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై వెబినార్ ద్వారా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్‌పై వెబ్‌నార్‌ను వీక్షిస్తున్న రైతులు



మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలి

**-ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి**

జగదేవ్‌పూర్, మార్చి 6 (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికబద్ధంగా అమలుచేయాలని జగదేవ్‌పూర్ ఎంపిడివో పి.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 99 రోజుల కార్యాచరణ చేపట్టాలని, రోజువారీగా గ్రామస్థాయిలో 99 రోజుల పాటు వివిధ పనులను నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఖాజా మొయినొద్దీన్, పంచాయతీ కార్యదర్శులు పల్లె తిరుపతి, సతీష్, రాజగోపాల్, కృష్ణారెడ్డి, మల్లేశం, ఐలయ్య, సాయిబాబా, విక్రమ్, రేఖ, నరేందర్, నరేష్‌రెడ్డి, రాజు, నవీన్, మమత, సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ప్రతి రంగంలో ముందుండాలి : ప్రిన్సిపాల్




మహిళా అధ్యాపకులు, సిబ్బందిని సన్మానించిన దృశ్యం

**వర్గల్, మార్చి 6(ప్రభాతవార్త):** మహిళలు ప్రతిరంగంలో ముందుండాలని, మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం వర్గల్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర, సహాయక సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో స్త్రీ చదువుకుంటే ఆ కుటుంబం అంతా జ్ఞానంతో నిండి ఉంటుందని, అలా కుటుంబాలు వృద్ధిలోకి వస్తే దేశమే అభివృద్ధి పథంలో నడుస్తుందని, ఒక స్త్రీ దేశాన్ని మార్చగలదని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.గోవిందరావు, డాక్టర్ బి.దీప్తి, జె.దీప్తి, ఏటిపి వర్జినీ దేదీప్య, డిడబ్ల్యూ జయలక్ష్మి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒకే పార్టీలో రెండు భిన్న స్వరాలు...

**ఒకరిపై ఒకరు విమర్శలు..వేడెక్కిన కాంగ్రెస్ రాజకీయం**

**అయోమయంలో మాజీ సర్పంచులు,కార్యకర్తలు**

**చిన్నశంకరంపేట, మార్చి 6,ప్రభాతవార్త:**

మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించే విషయంలో ఒకే పార్టీలో రెండు బిన్నస్వరాలు రావడంతో మాజీ సర్పంచులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. మాజీ సర్పంచులకు పాత బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం జీవో జారీచేసింది. పాత సర్పంచు లకు బిల్లులు చెల్లించవద్దని సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తెలిపారు. దీంతో ఆగ్రహించిన చిన్నశంకరంపేట మాజీ సర్పంచి రాజిరెడ్డి పెండింగ్ బిల్లులను వెంటనే మాజీ సర్పంచులకు చెల్లించాలని డిమాండ్‌చేశారు. గురువారం రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి వేరువేరుగా విలేఖరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ సర్పంచులు బిల్లులు అధికంగా చేయించు కొని ఎంబి రికార్డులు, చెక్కులు, కొలతలు చేయించుకున్న వారికి మాత్రమే బిల్లులు ఇవ్వద్దని అన్నానని, న్యాయంగా బిల్లులు ఉన్నవారికే ఇవ్వాలని అన్నట్లు ఆయన తెలిపారు. రాజిరెడ్డి మాట్లాడుతూ గ్రామాలభివృద్ధి కోసం అప్పులు తెచ్చి పనులు చేసిన వారికి బిల్లులు ఇవ్వద్దని అనడం సమంజసం కాదన్నారు. తాము గ్రామాలలో అభివృద్ధి పనులు నిర్వహించి అధికారులతో రికార్డులు చేయించుకుంటే ఆ రికార్డులు సరిగ్గా లేవని అనడం సరైంది కాద న్నారు. చేసిన అభివృద్ధి పనుల కోసం అప్పుల ఊబిలో కూరుకుపోయామని అన్నారు. వెంటనే మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# పట్టణాభివృద్ధికి పాలకవర్గం కృషిచేయాలి : మాజీ ఎమ్మెల్యే

**గజ్వేల్, మార్చి 6 (ప్రభాతవార్త):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందనరవీందర్, కమిషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ జాతీయ గీతం ఆలపించడంతో పాటు కార్యక్రమం విజయవంతంచేయాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి ఇందిరాపార్కు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీలకతీతంగా పట్టణ అభివృద్ధి కోసం పాలకవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. పట్టణంలోని పాత ఎంపిడిఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లడంతో 16వ వార్డు కౌన్సిలర్ నాయిని యాదగిరి పాత ఎంపిడివో కార్యాలయాన్ని వయోవృద్ధుల పెన్షన్లకు, యువత కోసం రీడింగ్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని చైర్మన్‌ను, కమిషనర్‌ను, కార్యక్రమంలోపాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిల దృష్టికి తీసుకువచ్చారు. వారు స్పందించి అభివృద్ధి కోసం తాము ముందుంటామని, ఏదైనా సమస్య ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 16వ వార్డులో ఎంపిడివో కార్యాలయ భవనం వెనుక శిథిలావస్థలో ఉన్న గోడలను పరిశీలించారు.

వార్డులలో శుభ్రత, మురికి కాలువలలో దోమల నివారణకు కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. 99 రోజుల ప్రణాళిక సందర్భంగా పలు వార్డులలో కలియతిరుగుతూ చీపురుపట్టి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, కౌన్సిలర్లు కప్ప మమత, గోలి మమత, కామిని మురళి, రొట్టెల శ్రీనివాస్, మన్నె రూప, బొగ్గుల స్వప్న, గుగులోత్ రమేష్, ఉపేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, భవాని, మర్కంటి భాగ్యలక్ష్మి, గుంటుకు లక్ష్మి, నక్క సంతోష రాములుగౌడ్, నాయిని సత్యలక్ష్మి యాదగిరి, శ్రీధర్, అత్తెల్లి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ తదితరులు

## 'డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'

**సిద్దిపేట అర్బన్, మార్చి 6, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ జి.జీవన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ద్వారా విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల రూపురేఖలు మారి పచ్చదనం, పరిశుభ్రత పెరిగి పారదర్శక పాలన అందించే అవకాశం ఉంటుందన్నారు. తహశీల్దార్ హరికిషన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తలపెట్టిన ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలంటే యువత భాగస్వాములు కావాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణాదేవి, హరిప్రసాద్, డాక్టర్ స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

## వరి సాగులో రైతులకు శిక్షణ

**సిద్దిపేట అర్బన్, మార్చి 6,ప్రభాతవార్త :** మండల పరిధిలోని రైతులకు శుక్రవారం వరి సాగులో మేలైన రకాల ఎంపికపై మండల వ్యవసాయ అధికారి, ఎటిఎంఎ సహకారంతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో తోర్నాల డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి వరిసాగులో విత్తన ఎంపిక ఎంతో కీలకమని పంట దిగుబడిపైన విత్తనం ఎంతో ప్రభావాన్ని చూపిస్తుందని వివరించారు. దొడ్డు రకాలలో జెజిఎల్–2443, ఆర్ఎన్ఆర్ 28361, కెఎన్ఎం 118, జెజిఎల్ 28639, డబ్ల్యుజిఎల్ 1537 వంటి రకాలద్వారా 32 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందవచ్చని అలాగే అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకుంటాయన్నారు. వానకాలంలో సన్నరకాలు ఆర్ఎన్ఆర్–15048, కెఎన్ఎం–1638,జెజిఎల్–27356 వంటి రకాల ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. యాసంగి పంట అనంతరం పెసర సాగు ద్వారా నేలలో నత్రజని స్థిరీకరణతో పాటుగా 5 నంచి 6 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చునని వివరించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మిట్టపల్లి సర్పంచ్ చింతల శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య కిట్లు పంపిణీ

**బెజ్జంకి, మార్చి 6, ప్రభాతవార్త :** గ్రామాన్ని ప్రతి నిత్యం పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా శ్రమిస్తారని సర్పంచ్ బిగుళ్ల మోహన్ అన్నారు. మండల పరిధిలోని కల్లెపల్లిలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ బిగుళ్ల మోహన్ చేతుల మీదుగా ఆరోగ్య కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్లపై మురికి కాల్వల్లో చెత్త చెదారం వేయొద్దన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పారిశుధ్యంలో ఇతరులకు ఆదర్శంగా నిలువడానికి గ్రామంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేషి వినీత్,కార్యదర్శి రాకేష్, వార్డు సభ్యులు మంకాల మోహన్, పబ్బతి విజేయశంకర్, నిషాని అనిల్, ఒగ్గు కనకయ్య, వేదిరే రాజయ్య, వేదిరే మనీషా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## భీలునాయక్ తండ్రిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**హుస్నాబాద్ రూరల్, మార్చి 6, ప్రభాతవార్త :** మాజీ జడ్పీటీసీ భీలునాయక్ తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీసి, వైద్యుల సూచనల మేరకు చికిత్స కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్, బాధితుడు త్వరగా ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీలునాయక్ కుటుంబ సభ్యులు కూడా మాజీ ఎమ్మెల్యేను ఆత్మీయంగా స్వాగతించి, పరామర్శించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత

**చిన్నకోడూరు, మార్చి 6, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో ఇద్దరు వృద్దులు మృతి చెందిన విషయాన్ని సర్పంచ్ కుంబాల మణెమ్మలాలయ్య ద్వారా తెలుసుకున్న యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబీకులను సంతాపం తెలియజేసి రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం పంపించారు. అనారోగ్యంతో మృతి చెందిన కమ్మరి నర్సయ్య(70), మైనాల భూమవ్వ(82) బాధిత కుటుంబీకులకు వంగ రాజేశ్వర్‌రెడ్డి పంపించిన ఆర్థికసహాయాన్ని సర్పంచ్, వార్డు సభ్యులు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజు, శోభ,చ, శిల్పా సునీల్, రోజా, మూర్తి, తిరుపతి, విఆర్ఆర్ ప్రతినిధులు కుంబాల చంద్రశేఖర్, విజేందర్‌రెడ్డి, రాజు,అజయ్, రుచిత్‌రెడ్డి, సంగెం శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**హుస్నాబాద్ టౌన్, మార్చి 6, ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తాటి మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో 16 మందికి కళ్యాణలక్ష్మి పథకం చెక్కులు అందజేశారు. అనంతరం దండి లక్ష్మి మాట్లాడుతూ పేద కుటుంబాల్లో అమ్మాయిల పెళ్లిళ్ల సమయంలో వచ్చే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకాన్ని అమలుచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, లక్ష్మారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, మున్సిపల్ విప్ కేశవేణి రమేష్, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూషవిద్యాసాగర్, బూరుగు లత కిష్టస్వామి, కొండ రజిత, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, భూక్యా సంపత్, కాశబోయిన సరిత, గడిపే సతీష్‌కుమార్, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేణి రమేష్, బొల్లి శ్రీనివాస్, ఆకుల రజిత వెంకన్న, వైద్యం కిరణ్‌ప్రసాద్, గాదెపాక రవీందర్, వాల సుప్రజనవీన్ రావు, బత్తుల స్వరూప, గోపగోని శోభన్ బాబుతో పాటు ఉన్నారు.

**హుస్నాబాద్ రూరల్‌లో...**

హుస్నాబాద్ మండలంలోని తొమ్మిది గ్రామాలకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను శుక్రవారం హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు పోలు సంపత్‌లు ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లతో కలిసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది గ్రామాలకు మొత్తం 29 చెక్కులు మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు తోడేటి రమేష్, మడప జైపాల్‌రెడ్డి, బంటు సంపత్,జిల్లల తిరుమల, వేల్పుల సంపత్, రాచపల్లి శ్రీనివాస్, బంక పద్మచందుతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## దుర్భాషలాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**సిద్దిపేట అర్బన్, మార్చి 6, ప్రభాతవార్త :** విధి నిర్వహణలో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై దుర్భాషలాడిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం టూ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మందపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్న భవాని విధినిర్వహణలో ఉండగా అదే గ్రామానికి చెందిన డి.ప్రశాంత్ కొంత మందితో వచ్చి ఇష్టానుసారంగా మాట్లాడాడని విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించాడని చట్టరీత్యా అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న గ్రామ కార్యదర్శులు

# ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతిపాలన సాధ్యం

### -అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.క్రిష్ణారెడ్డి

**జోగిపేట, మార్చి 6, ప్రభాతవార్త:**
ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేద్దామని అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.క్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు పాలకవర్గం సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో 99 రోజుల పాటు వివిధ కార్యక్రమాల షెడ్యూల్‌లను రూపొందించిందని, ఆ మేరకు మున్సిపాలిటీలో కార్యక్రమాలు చేపట్టాలని, అయితే ఈ పనులు సజావుగా సాగాలంటే తప్పనిసరిగా ప్రజలను ఇందులో భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణం ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలంటే మున్సిపల్ సిబ్బంది మాత్రమే పనిచేస్తే సరిపోదని, ప్రతిఒక్కరూ తమ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, కౌన్సిలర్లు కొశికె రాజశేఖర్, శ్రీనివాస్, తోట్ల రామక్రిష్ణ, నాగరత్నంగౌడ్, పట్లూరి శివశేఖర్‌లతో పాటు మిగతా కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.క్రిష్ణారెడ్డి

# పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### -కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌నర్సయ్య

**కొండపాక, మార్చి 6, ప్రభాతవార్త:**
పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా వారి అకౌంట్‌లో వేతనాలు జమస్తామని సిఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చి తప్పుతున్నారని గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమ్ముల బాల్‌నర్సయ్య గుర్తు చేశారు. శుక్రవారం కొండపాక, కుకునూరుపల్లి ఎంపిడిఒల కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించి కొండపాక ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, కుకునూరుపల్లి ఎంపిడిఒ రాంప్రసాద్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించక కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తుందన్నారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు, చెప్పిన మాటలు రెండు సంవత్సరాలు గడిచిపోతున్నా నేటికీ అమలు కాలేదన్నారు. గతంలో ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించి నేరుగా వేతనాలు చెల్లించిందన్నారు. ఎన్నికలకు ముందు తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పంచాయతీ కార్మికులకు కనీసవేతనం అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు వేతనాలను పంచాయతీ పాలకవర్గమే చెల్లించాలని 2వ తేదీన పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుండి సర్క్యులర్ జారీ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. పంచాయతీల్లోనే నిధులులేక అవి చతికిలపడిపోతుంటే మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లు కాంగ్రెస్ ప్రభుత్వ చర్య ఉందన్నారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చే నిధులు సరిపోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీగా ఉద్యమం చేపడతామని అయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అరుట్ల నర్సింలు, బోగి సాయికుమార్, నాగరాజు, గజ్జి నర్సింలు, పల్లె శ్రీనివాస్, గొడుగు నారాయణ, అకారం రవి, దబ్బెట సుధాకర్, దాసరి రాజు, పొట్టల నరహరి, లక్ష్మణ్, లక్ష్మి, కనకవ్వ, రమణచారి, చంద్రయ్య, ఎల్లయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


కుకునూరుపల్లి ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

## లాంఛనంగా ప్రారంభమైన శ్రీనల్లపోచమ్మ జాతర

### -అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ


శ్రీనల్లపోచమ్మతల్లిని గర్భాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

**కౌడిపల్లి, మార్చి 6, ప్రభాతవార్త:**
జిల్లాలోనే రెండవ అతిపెద్ద జాతరగా పేరుగాంచిన తునికి శ్రీనల్లపోచమ్మ జాతరను శుక్రవారం ఆలయ ఇంచార్జి ఈవో రంగారావు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ తాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామసర్పంచి ధనలక్ష్మశేఖర్‌ల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శివప్ప వేదమంత్రాల నడుమ అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించి, పట్టువస్త్రాలతో అమ్మవారిని వైభవంగా అలంకరించి, ప్రత్యేకపూజలు చేసిన తర్వాత గ్రామపెద్దల సమక్షంలో ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. తునికి గ్రామం నుండి బాజాభజంత్రీలనడుమ భక్తులు బండారు(పసుపుబొట్టు) తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి, ఆలయ ఆర్చకులతో ప్రత్యేకపూజలు చేశారు. శనివారం అగ్నిగుండాలు, బోనాలు ఉంటాయని ఈవో రంగారావు తెలిపారు. జాతరకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ముఖ్యంగా త్రాగునీటి సమస్య రాకుండా ఆలయసిబ్బంది తగుచర్యలు తీసుకుంటున్నట్లు ఈవో తెలిపారు. ఈకార్యక్రమంలో ఈయనతోపాటు ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, గ్రామపెద్దలు సాయాగౌడు, చల్లా మల్లేశం, కొండల్‌రెడ్డి, నారాయణరెడ్డి, శంకరయ్య, వాలంటీర్లు, స్థానిక ఎస్సై అమరేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


ఎస్ఎస్ఎఫ్ సైన్స్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

**అల్లాదుర్గం, మార్చి 6, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన అల్లాదుర్గంలో శుక్రవారం మైనార్టీ యువనాయకుల ఆధ్వర్యంలో సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ సైన్స్ క్యాలెండర్(ఎస్ఎస్ఎఫ్)ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రఅధ్యక్షులు బాన్సువాడ వేదాంతమౌర్య పాల్గొని ప్రసంగించారు. 22 ఏళ్ల చరిత్రకల్గిన ఎస్ఎస్ఎస్ సంఘం చరిత్ర విద్యార్థి ఉద్యమంలో ఎంతో గణనీయంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తులో మూఢనమ్మకాల ప్రభావం ఎక్కువగా రుద్దబడుతుందని, వారి కౌమారదశలోనే శాస్త్రీయ అవగాహన కల్పించడం తోపాటు సామాజిక కార్యక్రమాలు ఏర్పాటుచేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు లతీఫ్ మాట్లాడుతూ సైన్స్ గొప్పతనాన్ని అర్థం చేసుకుని అందరూ ఆచరణలో పెట్టాలని, అప్పుడే సమాజం అభివృద్ధిలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్వరాజ్య ఉద్యమ నాయకులు మోహన్ రాథోడ్, అల్లాదుర్గం ఉపసర్పంచి, నాయకులు కళాయి పాండు, బేతయ్య, ఈర్యానాయక్‌లు పాల్గొన్నారు.

## జడ్పిహెచ్ఎస్‌ను సందర్శించిన ఇన్స్పెక్షన్ బృందం


జడ్పిహెచ్ఎస్‌ను సందర్శిస్తున్న ఇన్స్పెక్షన్ బృందం బాధ్యులు

**రామచంద్రాపురం, మార్చి 6, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని తెల్లాపూర్‌లోని పిఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను శుక్రవారం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఇన్స్పెక్షన్ బృంద సభ్యులు సందర్శించారు. ఉదయం మినిస్ట్రీ ఆఫ్ ఫార్మసూటికల్స్ సంయుక్త డైరెక్టర్ అమన్‌శర్మ, మిడ్‌డే మీల్స్ డిడి జనార్ధన్‌రావు, జిల్లా విద్యాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, సిఎంఓ వెంకటేశం, ఎఎంఓ బాలయ్య, మండల విద్యాధికారి రాములు పాఠశాలను సందర్శించి అమలవుతున్న వివిధ రకాల అంశాలను పరిశీలించారు. విద్యార్థులను వివిధ అంశాల్లో పరీక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌కు పలురకాల సూచనలు చేశారు.

## బిఆర్ఎస్‌లో అంతర్గత కుట్రలపై విచారణ జరపాలి

### -మాజీ సర్పంచి పులిగిల్ల ప్రకాష్‌చారి

**జిన్నారం, మార్చి 6, ప్రభాతవార్త:**
గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కిష్టయ్యపల్లి 15వ వార్డులో గత మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీలో జరిగిన పరిణామాలపై గడ్డపోతారం మాజీసర్పంచి పులిగిల్ల ప్రకాష్‌చారి స్పందించారు. శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియాసమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌పార్టీ నుంచి పోటీచేసిన పులిగిల్ల శ్రీనివాస్ ఓటమికి స్వంతపార్టీ నాయకులే కారణమయ్యారని ఆయన ఆరోపించారు. పార్టీ లోపలే కుట్రలుజరిగి శ్రీనివాస్ ఓటమికి దారితీసిందని, ఇంటిదొంగలే ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. ఈవిషయంపై గ్రౌండ్‌లెవెల్‌లో పూర్తిస్థాయి విచారణజరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలి కాని, స్వంతపార్టీ నాయకులే మోసంచేశారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఈవిషయంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు కూడా నివేదిక పంపించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే బిఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌కు ఎన్నికలసమయంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## నీమ్జ్ భూములకు సరిహద్దురాళ్ల ఏర్పాటు


నీమ్జ్‌భూముల సరిహద్దులో బండరాళ్లు ఏర్పాటుచేస్తున్న రెవిన్యూ అధికారులు

**న్యాలకల్, మార్చి 6, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ముంగి గ్రామశివారులోని నీమ్జ్ ప్రాజెక్టు భూములకు సంబంధించి సరిహద్దురాళ్లను శుక్రవారం రెవిన్యూ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య ఏర్పాటుచేశారు. నీమ్జ్ ప్రాజెక్టు మౌలిక వసతుల కల్పన కోసం సంబంధిత అధికారులు గురువారం సరిహద్దురాళ్ల ఏర్పాటుకు యత్నించగా రైతులు, మహిళలు అడ్డుపడి ప్రక్రియను అడ్డుకున్నారు. శుక్రవారం అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య సరిహద్దురాళ్లను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభులు, ఆర్ఐ శ్యాంరావు, సర్వేయర్ లాల్‌సింగ్, జిపిఓ ప్రకాష్, డిఎస్‌పి సైతానాయక్, సిఐ జక్కుల హనుమంతు, హద్నూర్ ఎస్ఐ దోమ సుజిత్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ


గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ

**సిర్గాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని నల్లవాగు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను శుక్రవారం మండలవిద్యాధికారి నాగారం శ్రీనివాస్ తనిఖీచేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. క్రమశిక్షణతో విద్యను అందుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఫణిందర్, ఉపాధ్యాయులు విఠల్, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించండి

### -ఉపకమిషనర్‌కు కాంగ్రెస్ నేతల వినతి


ఉపకమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న కాంగ్రెస్ నేతలు

**రామచంద్రాపురం, మార్చి 6, ప్రభాతవార్త:**
తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్, కొమరం భీమ్, జ్యోతిరావుపూలే కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సి.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పటాన్‌చెరు సర్కిల్ ఉపకమిషనర్ జ్యోతిరెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సమస్యలు తాండవిస్తున్నాయని, డ్రైనేజి వ్యవస్థ అస్థవ్యస్తంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభాకర్‌రెడ్డి ఉపకమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాకిజనవాడలో మహిళాశక్తి భవనానికి భూమిపూజ


మహిళాశక్తి భవన నిర్మాణానికి పూజలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**న్యాల్‌కల్, మార్చి 6, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కాకిజనవాడ గ్రామంలో మహిళాశక్తి భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి భవననిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి లక్ష్మారెడ్డి, ఉపసర్పంచి సల్మాన్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బీరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ మాజీచైర్మన్ సిద్దలింగయ్యస్వామి, నాయకులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, రేజింతల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకాపు ఈశ్వరమ్మ మండపం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న పీఠాధిపతి అవదూతగిరి మహారాజ్

**జహీరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:**
పట్టణంలోని 16వ వార్డు మాణిక్‌ప్రభు వీధిలో కొత్తకాపు కుటుంబం సహకారంతో నిర్మించిన కొత్తకాపు ఈశ్వరమ్మ మండపాన్ని శుక్రవారం ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి 1008 వైరాగ్యశిఖామణి అవదూతగిరి మహారాజ్(అప్పగారు), జహీరాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ శిరీషసురేందర్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహ్మద్ యునూస్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఎస్.ఉజ్వల్‌రెడ్డి, సిడిసి చైర్మన్ మోబిన్, కౌన్సిలర్ రంగా అరుణ్‌కుమార్, ఆల్ ఇండియా బిఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షులు కొత్తకాపు లక్ష్మారెడ్డి, ఆలే శ్యాంకుమార్, కొత్తకాపు సుభాష్‌రెడ్డి, బండి చంద్రప్ప, కొత్తకాపు సురేందర్‌రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీమహంకాళి అమ్మవారి వార్షికోత్సవాలు

**జోగిపేట, మార్చి 6, ప్రభాతవార్త:**
జోగిపేట హౌసింగ్‌బోర్డు కాలనీలో టిటిడి ఆవరణలో ఉన్న శ్రీమహంకాళి అమ్మవారి ఆలయ దశమవార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అయ్యప్ప పార్వతమ్మ, నర్సింలు, అయ్యప్ప శారదల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు వైభవంగా చేపట్టారు. ఉదయం అమ్మవారికి మహాభిషేకం, కుంకుమార్చన చేపట్టిన అనంతరం 11 గంటలకు అమ్మవారి హోమం, గణపతిహోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ ఎస్.క్రిష్ణారెడ్డి, కౌన్సిలర్లు శోభానారాయణగౌడ్, తోట్ల రామక్రిష్ణ, నాగరత్నంగౌడ్‌లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

## ఈ నెల 11న చిత్రియాల్లో ఇసుక వేలం

**పాపన్నపేట, మార్చి 6, ప్రభాతవార్త:**
ఈ నెల 11న ఉదయం 11 గంటలకు మండల పరిధిలోని గాజులగూడెంలో ఇసుక వేలం పాటలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సతీష్ తెలిపారు. గత నెల 26న మంజీర నది నుండి అక్రమంగా తీసిన 834 క్యూబిక్ మీటర్ల ఇసుకను, మైనింగ్, అధికారుల సూచన మేరకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని తెలిపారు. అధికారుల అంచనా ప్రకారం 265 ట్రాక్టర్ల ఇసుక ఉంటుందని చెప్పారు. ఒక వేళ అంతకన్నా ఎక్కువగా ఉంటే, వేలం హక్కులు పొందిన వారు అదనపు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## భూములు కొంటున్న వారు జాగ్రత్తలు పాటించాలి

### -సిఐ వెంకట్‌రెడ్డి

**సిర్గాపూర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని కంగ్టి, సిర్గాపూర్ పరిధిలని భూములు కొంటున్న వారు పలు జాగ్రత్తలు పాటిస్తూ భూములను కొనాలని సిఐ వెంకట్‌రెడ్డి సూచించారు. కొందరు దళారులు రైతు పాస్‌బుక్‌పై ఉన్న ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ అగ్రిమెంట్ చేసుకుని మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎక్కడో దూరంగా ఉన్న భూములకు బదులుగా రోడ్డు పక్కన ఉన్నట్లు చూపిస్తూ రిజిస్ట్రేషన్ చేస్తూ మోసం చేస్తున్నారన్నారు. భూములు కొనుగోలు చేసే రైతులు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటిస్తూ మండల ప్రజాప్రతినిధుల, అధికారుల ద్వార రెవిన్యూ రికార్డులను పరిశీలించి ప్రస్తుత మార్కెట్ ధర తెలుసుకుని భూములను కొనాలని సిఐ వెంకట్‌రెడ్డి డివిజన్ ప్రజలకు సూచించారు.

## నిల్వ నీటిని శుద్ధిచేసి పంపిణీ చేయడమే లక్ష్యం

### -సేఫ్ వాటర్ నెట్‌వర్క్ ఇండియా స్వచ్ఛంద సంస్థ బృందం వెల్లడి


రక్షిత నీటి ట్యాంక్‌కు ఎసిఓఎం యంత్రాన్ని బిగించిన ఎస్‌డబ్ల్యుఎన్ఐ సంస్థ ప్రతినిధులు

**కౌడిపల్లి, మార్చి 6, ప్రభాతవార్త:**
సింగపూర్ సాంకేతిక సౌజన్యంతో పాటు ఆర్థిక సహాయంతో ప్రజలకు స్వయంచాలక క్లోరినేషన్ (ఎసిఓఎం) వ్యవస్థ ద్వారా నిల్వ ఉన్న నీటిని శుద్ధిచేసి, సురక్షితమైన త్రాగునీటిని పంపిణీచేయడమే సేఫ్ వాటర్ నెట్‌వర్క్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రధానలక్ష్యమని ఆసంస్థ బృందసభ్యులు పూనమ్, శంకర్‌లు పేర్కొన్నారు. శుక్రవారం కౌడిపల్లి గ్రామ పంచాయతీలోని రెండు రక్షిత నీటిట్యాంకుల వద్ద స్వయంచాలక క్లోరినేషన్ ప్లాంట్లను సేఫ్ వాటర్ నెట్‌వర్క్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బిగించడం జరిగింది. కౌడిపల్లి గ్రామపంచాయతీని సందర్శించిన సింగపూర్ యూనివర్సిటీ ప్రతినిధులు జోఫెన్, డాక్టర్ సంతోష్‌పటక్, సేఫ్‌వాటర్ నెట్‌వర్క్ స్వచ్ఛంద సంస్థ బృందం సభ్యులు రబీ, పూనమ్, ప్రభాత్, శంకర్, మల్లికార్జున్, చంద్ర, దేవేందర్, రవి తదితరులను గ్రామసర్పంచి చంద్రం కృష్ణాగౌడు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈయనతోపాటు ఎంపిడివో శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపివో రామారావు, మిషన్ భగీరథ ఏఈ విశ్వసాయి, ఎపివో పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఉపసర్పంచి శ్వేతామల్లికార్జున్‌గౌడు, వార్డు సభ్యులు దేవేందర్ కుమార్, మాక్బుల్, రమేష్‌నాయక్, లక్ష్మశరత్‌కుమార్, సందీప్‌కుమార్, గౌడిచర్ల ప్రశాంత్, బోంతమ్మ సంగప్ప, నాయకులు రమేష్‌గౌడు, కుర్మ లక్ష్మన్‌యాదవ్, ఆర్యవైశ్యసంఘం జిల్లా కార్యవర్గసభ్యులు శ్రీనివాస్‌గుప్తా, ఉడుత రాజుగుప్తా, విశ్రాంతి కంపౌండర్ డాక్టర్ పురుషోత్తం, పుండరీకం గౌడు, ఆర్పీ, కారోబార్ యేల్లం తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట రైతువేదికలో పోస్ట్ బడ్జెట్ వెబినార్


పిఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న వ్యవసాయ అధికారులు

**రామాయంపేట, మార్చి 6, ప్రభాతవార్త:**
రైతులకు కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి సంబంధించిన పథకాలపై అవగాహన కల్పించేందుకు రామాయంపేట రైతువేదికలో డివిజన్‌స్థాయిలో పోస్ట్‌బడ్జెట్ వెబినార్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి పలు ముఖ్య అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా భారత విస్తార్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ రంగంలో ఎఐ ఆధారిత డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొబ్బరి ప్రమోషన్ పథకం ద్వారా కొబ్బరి సాగును ప్రోత్సహించడం, జాతీయ కాజూ, కోకో అభివృద్ధి కార్యక్రమం, భారతదేశంలో బాదం, అక్రోట్, పైన్ నట్ (చిల్గోజా) సాగుకు భవిష్యత్ వ్యూహాలు, అలాగే సాండల్‌వుడ్, అగర్‌వుడ్ అగ్రోఫారెస్ట్రీ ప్రోత్సాహం వంటి అంశాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయసంచాలకులు విజయనిర్మల, ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి భరత్‌కుమార్, నిజాంపేట మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, రామాయంపేట, మెదక్ డివిజన్‌కు చెందిన వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అల్లాడి వీరేశంకు దానవిశారద బిరుదు

### -అవార్డును అందచేసిన పీఠాధిపతులు

**జహీరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:**
ప్రముఖ వ్యాపారవేత్త, దత్తగిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశంగుప్త భక్తిసేవలను గుర్తించి కర్ణాటక రంభపురి వీరసింహాసన మహాసంస్థాన పీఠం జగద్గురు ప్రసన్నరేణుకా వీరసోమేశ్వర శివాచార్య దానవిశారద బిరుదును ప్రకటించారు. తడోల్ ఆశ్రమ పీఠాధిపతి రాజేశ్వర్ శివాచార్య, బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమపీఠాధిపతి అవదూతగిరి మహారాజ్ (అప్పగారు), సిద్ధేశ్వరానందగిరి మహారాజ్‌లు బిరుదుపత్రాన్ని అల్లాడి వీరేశంకు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సహాయం

**గుమ్మడిదల, మార్చి 6, ప్రభాతవార్త:**
గుమ్మడిదలమున్సిపల్ పరిధిలోని దానయ్య సరిత-వెంకటేష్ దంపతుల కుమార్తె శిరీషవివాహానికి 15వ కౌన్సిలర్ పొన్నాల ప్రమీల ఆర్థికసహాయం సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సౌజన్యంతో అందజేశారు. ఆడబిడ్డవివాహం సక్రమంగా జరగాలని ఆకాంక్షిస్తూ తనవంతుగా సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు బిఆర్ఎస్ యువ నాయకులు పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలయ్యాక గ్రామాభివృద్ధి పైనే దృష్టి

### -పంచాయతీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్


చిమ్నాపూర్‌లో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**కంది, మార్చి 6, ప్రభాతవార్త:**
ఎన్నికలవరకే రాజకీయాలు చేయాలని, ఎన్నికలు పూర్తయ్యాక గ్రామం అభివృద్ధిపై ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని చిమ్నాపూర్‌లో కొత్తగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామసర్పంచి కృష్ణగౌడ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పంచాయతీ వ్యవస్థ కీలకమన్నారు. తమపై నమ్మకంతో ప్రజలు తమను ప్రజాప్రతినిధిగా ఎన్నుకున్నారని ప్రజలనమ్మకం వమ్ముకాకుండా గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. చిమ్నాపూర్‌గ్రామం అభివృద్ధికి తనవంతు సహకారం అందచేస్తామన్నారు. గ్రామంలో పాఠశాల భవన నిర్మాణానికి సహకారం అందచేస్తామన్నారు. పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు కొండల్‌రెడ్డి, మనోహర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచెందర్‌నాయక్, ఉపసర్పంచి మోతీలాల్, నాయకులు ఆంజనేయులు, సుధీర్ రెడ్డి, సాయిగౌడ్, అయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.